



రిజర్వాయర్‌లో డంప్ చేసిన నాపరాయి వేస్టేజీ

- జలాశయాన్ని దురాక్రమించి నాపరాతి డిపోల ఏర్పాటు
- వేల మెట్రిక్ టన్నుల వేస్టేజీని రిజర్వాయర్‌లో తోస్తున్న వ్యాపారులు
- తగ్గుతున్న నీటి నిల్వ శాతం
- కలుషితమవుతున్న నీరు
- పట్టించుకోని అధికారులు

ఆక్రమణలో అవుకు రిజర్వాయర్

అవుకు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :

అవుకు రిజర్వాయర్ భారీగా ఆక్రమణకు గురవుతున్నా ఎస్సార్బీసీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలేరు చెరువు, గొల్లలేరు, తిమ్మరాజు చెరువులను కలుపుతూ 4.148 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మితమైంది. నంద్యాల, కడప జిల్లాల్లోని 42,509 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు రిజర్వాయర్ నుంచి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ. 36.50 కోట్ల వ్యయంతో కమ్యూనిటీ ప్రాజెక్ట్ వాటర్ సప్లయ్ (సీపీడబ్ల్యూఎస్) స్కీంను నిర్మించారు. ఈ పథకం ద్వారా అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని 50 గ్రామాలకు ప్రతి రోజు 40 లక్షల లీటర్లు (4ఎంఎల్‌డీ) తాగునీరు అందుతోంది. అలాగే కొలిమిగుండ్ల మండలంలో నిర్మించిన రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి రెండు సంవత్సరాల క్రితం నుంచి ప్రతిరోజు 25 లక్షల లీటర్ల (2.5ఎంఎల్‌డీ) నీటిని రిజర్వాయర్ నుంచి తరలిస్తున్నారు. ఇంత ప్రాధాన్యత ఉన్న అవుకు రిజర్వాయర్ పెద్ద ఎత్తున ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకొనే అధికారులు కరువయ్యారు.



రిజర్వాయర్ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న నాపరాతి డిపోలు

రిజర్వాయర్‌ను ఆక్రమించి నాపరాతి డిపోల ఏర్పాటు

రిజర్వాయర్ పక్కనే తాడిపత్రికి వెళ్లే నేషనల్ హైవే (ఎన్‌హెచ్ 544డి) ప్రధాన రహదారి ఉంది. వాహనదారుల రక్షణ కోసం రిజర్వాయర్ ఫుల్ రిజర్వాయర్ లెవెల్ (ఎఫ్ఆర్ఎల్) స్థాయి నుంచి 150 నుంచి 200 మీటర్లు స్థలాన్ని వదిలి ఎన్‌హెచ్ రహదారిని నిర్మించారు. రిజర్వాయర్ వెంట వదలిన స్థలం నాపరాతి డిపోల వ్యాపారులకు వరంగా మారింది. రిజర్వాయర్ సమీపంలోని చెర్లోపల్లె, రామాపురం గ్రామాల పరిధిలో విస్తారంగా మైనింగ్ (నాపరాతి గనులు) విస్తరించి ఉన్నాయి. గనుల్లోని నాపరాతిని ట్రాక్టర్ల ద్వారా రిజర్వాయర్ ఆక్రమిత స్థలం వద్దకు తీసుకవచ్చి 1 కి.మీ పొడవున నాపరాతి డిపోలను వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు.



తమిళనాడుకు తరలించేందుకు చెక్కపెట్టెల్లో సిద్ధం చేసిన నాపరాయి

తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం

నాపరాతి డిపోల నుంచి వచ్చే వేస్టేజీతో పాటు నాపరాయి పాలిష్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థాలను రిజర్వాయర్‌లో భారీ ఎత్తున డంప్ చేస్తుండటంతో రిజర్వాయర్‌లో పూడిక చేరి నీటినిల్వ శాతం తగ్గిపోతుంది. రిజర్వాయర్ నుంచి పలు గ్రామాలకు అందించే తాగునీరు కలుషితమవుతోంది. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నది. ఎస్సార్బీసీ ఉన్నతాధికారులు దృష్టి సారించి రిజర్వాయర్ ఆక్రమణను అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాపరాతి వ్యర్థాలను రిజర్వాయర్‌లోకి తోస్తున్న వ్యాపారులు

వ్యాపారులు నాపరాతి డిపోల వద్ద నిల్వ ఉంచిన రాళ్లను కార్మికులతో వివిధ ఆకృతుల్లో కటింగ్ చేయిస్తున్నారు. ఆ నాపరాళ్లను చెక్కపెట్టెల్లో చేర్చి ప్యాకింగ్ చేసి తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు సరఫరా చేస్తూ వ్యాపారులు రూ. లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. నాపరాతి కటింగ్ నుంచి వచ్చే వేల మెట్రిక్ టన్నుల వేస్టేజీని మాత్రం ఎక్స్‌కవేటర్లతో రిజర్వాయర్‌లోకి తోసేస్తున్నారు. అంతేగాక నాపరాళ్ల పరిశ్రమల నుంచి వచ్చే వేస్టేజీని కూడ రిజర్వాయర్‌లో వదులుతున్నారు.



నాపరాతి వేస్టేజీతో తగ్గనున్న నీటినిల్వ

నాపరాతి డిపోలను ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు నాపరాతి కటింగ్ నుంచి వచ్చే వేస్టేజీని రిజర్వాయర్‌లో వేస్తున్నారు. దీంతో రిజర్వాయర్‌లో నీటినిల్వ శాతం తగ్గిపోతున్నది. నాపరాతి ఫ్యాకరీల నుంచి వచ్చే వ్యర్థాలను రిజర్వాయర్‌లో వేస్తుండటంతో తాగునీరు కలుషితమవుతున్నది.

- వెంకట రమణనాయక్, అవుకు



రిజర్వాయర్ నిర్వహణను గాలికి వదిలేశారు

రిజర్వాయర్ నిర్వహణను ఎస్సార్బీసీ అధికారులు గాలికి వదిలేశారు. వ్యాపారులు రిజర్వాయర్ స్థలాన్ని ఆక్రమించుకోవటమే కాక నాపరాతి కటింగ్ నుంచి వచ్చే వేస్టేజీని రిజర్వాయర్‌లో వేయటం వ్యాపారులకు తగదు. నాపరాతి డిపోల వ్యాపారులను ఖాళీ చేయించాలి.

- మారం పుల్లారెడ్డి, రామాపురం గ్రామం.

నాపరాతి డిపో వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం

రిజర్వాయర్ స్థలాన్ని ఆక్రమించి నాపరాతి డిపోలను ఏర్పాటు చేసుకున్న వ్యాపారులపై త్వరలో చర్యలు చేపడతాం. ఎస్సార్బీసీ డీఈలు, ఏఈలకు ఆదేశాలు జారీ చేశాం. పోలీసులకు ఫిర్యాదు చేసి నాపరాతి డిపోలను ఖాళీ చేయిస్తాం.

- సురేష్‌బాబు, ఎస్సార్బీసీ ఈఈ, అవుకు



లారీలో లోడ్ చేస్తున్న మహిళా కార్మికులు

నేడు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

నంద్యాల కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో శనివారం (నేడు) ఉదయం 10 గంటలకు నంద్యాల పట్టణంలో జరుగనున్నాయి. నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డ్ మైదానంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానికంగా జరిగే ముగ్గుల పోటీలకు బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన విజేతలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు అందజేస్తారు. ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి ఉంటుంది. వివరాలకు 99854 11362, 70759 06669, 94908 81335 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.



విద్యార్థులు సృజనాత్మకత పెంచుకోవాలి: కలెక్టర్



సైన్స్‌ఫెయిర్‌ను తిలకిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకొని చదివితే ఉన్నత స్థితిలో రాణించగలుగుతారని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం నంద్యాల ఎస్పీజీ పాఠశాలలోని జిల్లా స్థాయి సదరన్ సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలను కంఠస్థం చేయకుండా సృజనాత్మకంగా నేర్చుకోవాలని అన్నారు. పాఠశాలలో నిర్వహించే వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన సైన్స్‌ఫెయిర్‌లాంటి పోటీలలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని అన్నారు. సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, డీఈఓ జనార్ధన్‌రెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంతకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

'ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వీడండి'

నంద్యాల కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడంలో నిర్లక్ష్యాన్ని విడనాడాలని కలెక్టర్ రాజకుమారి ఏపీడీ, ఏపీఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఉపాధి హామీ లక్ష్యాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ లేబర్ బడ్జెట్ కింద వందరోజుల పనిదినాలు కల్పించడంలో పూర్తిగా వెనుకబడి ఉన్నారన్నారు. జిల్లాలో 2.3 లక్షల మంది కూలీలు ఉంటే కేవలం మూడువేల మందికి మాత్రమే వందరోజుల పనిదినాలు కల్పించడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

రామ్‌కో చుట్టూ ఉన్న భూములను కొనాలి

- కాలుష్యం నుండి పంటలను రక్షించాలి ..
- ప్రజాభిప్రాయ సేకరణలో రైతుల డిమాండ్
- ఫిర్యాదులన్నీ నమోదు చేశామన్న జేసీ విష్ణుచరణ్
- రామ్‌కో ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు ఓకే చెప్పిన మెజారిటీ వర్గం

కొలిమిగుండ్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రామ్‌కో సిమెంట్ పరిశ్రమ చుట్టూ మిగిలిన భూములన్నీ కంపెనీ కొనాలని ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పరిసర గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్వటాల గ్రామ పరిధిలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ రూ.1210 కోట్లు వెచ్చించి చేపడుతున్న ఉత్పత్తి సామర్థ్యం పెంపు ప్రతిపాదనపై కాలుష్య నియంత్రణ మండలి అధికారి మునిప్రసాద్, పర్యావరణ అధికారి కిశోర్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన, నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రామ్‌కో సిమెంట్ పరిశ్రమ క్లింకర్ సామర్థ్యం 3.15ఎంటీపీఏ నుండి 6.3ఎంటీపీఏకు పెంచడం, సిమెంట్ ఉత్పత్తి 2.0ఎంటీపీఏ నుండి 5.0ఎంటీపీఏకు పెంచడం, వేస్ట్ హీట్ రికవరీ పవర్ ప్లాంట్ 12.15 ఎండబ్ల్యూ నుండి 27.15 ఎండబ్ల్యూకు పెంచడం కోసం కాలుష్య నియంత్రణ వారు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. దీనిపై రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు మాట్లాడుతూ ఆధునాతన టెక్నాలజీతో కాలుష్య రహితంగా సిమెంట్ పరిశ్రమ ఉత్పత్తి జరుగుతోందని అన్నారు. ఇప్పటికే పరిశ్రమ ద్వారా 900మందికి ఉద్యోగాలు లభించాయని, ప్రస్తుత అదనపు ఉత్పత్తి ద్వారా మరో 300మందికి ప్రత్యక్షంగా, 200మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. రూ.17కోట్లు సీఎస్ఆర్ నిధులతో ఇప్పటికే రామ్‌కో పరిధిలోని గ్రామాల్లో పలు ప్రజామోద అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి సంక్షేమం అందిస్తామని రెడ్డి నాగరాజు అన్నారు. మరోవైపు పలు గ్రామాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ రామ్‌కో సీఎస్ఆర్ ద్వారా మంచి పనులు చేస్తోందని, మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. రామ్‌కో పరిశ్రమకు ప్రభుత్వం అన్ని అనుమతులు మంజూరు చేయాలని వారు పేర్కొన్నారు. కల్వటాల, కొలిమిగుండ్ల గ్రామాలకు చెందిన రైతులు మాత్రం తమకు రామ్‌కో పరిశ్రమ కాలుష్యం వల్ల నష్టం జరుగుతోందని వాపోయారు. పరిశ్రమ నుండి వచ్చే దుమ్ముతో పంటలు పండటంలేదు కాబట్టి రామ్‌కోకు దగ్గరగా ఉన్న భూములను కొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, పులి ప్రకాశ్‌రెడ్డి, కల్వటాల సర్పంచ్ కామిని సుమలత, కామిని క్రిష్ణరంగారెడ్డి, అంబటి జయలక్ష్మీరెడ్డి, పేరం సత్యానారాయణరెడ్డి, బయ్యపురెడ్డి పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసులు బందోవస్తు నిర్వహించారు.



సమావేశంలో పాల్గొన్న జేసీ విష్ణుచరణ్, కాలుష్య నియంత్రణ అధికారులు

ఫిర్యాదులన్నీ నమోదు చేశాం - జేసీ విష్ణుచరణ్: వివిధ వర్గాలు ప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతులు ప్రస్తావించిన సమస్యలన్నీ నమోదు చేశామని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి పంపనున్నట్లు తెలిపారు. పరిశ్రమ దృష్టికి సమస్యలను తీసుకవెళ్లి పరిష్కారానికి చొరవ చూపేలా ఆదేశిస్తామని జేసీ అన్నారు.

విద్య, వైద్యంపై రామ్‌కో కేంద్రీకరించాలి

రామ్‌కో పరిశ్రమ మా గ్రామ పరిధిలో ఉండటం మాకు గర్వకారణం. గ్రామాల్లో విద్య, వైద్యంపై కంపెనీ దృష్టి సారించాలి. సీబీఎస్ పాఠశాలను ఏర్పాటుచేసి పేద విద్యార్థులకు విద్యనందించండి.

-కామిని సుమలత (కల్వాటాల - సర్పంచ్)

కాలుష్యాన్ని నియంత్రించాలి

పరిశ్రమ నుండి వచ్చే కాలుష్యాన్ని నియంత్రించాలి. పరిశ్రమకు అనుకొని ఉన్న భూములు కొనుగోలు చేయాలి. పంటలకు నష్టపరిహారం అందించేలా చూడాలి.

-గూడూరు నాగేశ్వరరెడ్డి (రైతు- కొలిమిగుండ్ల)



సమావేశానికి హాజరైన రైతులు, నాయకులు

ఇజితెమా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

ఆత్మకూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో జనవరి 7,8,9 తేదీల్లో జరగనున్న తబ్లిగీ ఇజితెమా కార్యక్రమం ఏర్పాట్లను శుక్రవారం ఎస్పీ ఆధిరాజ్‌సింగ్ రాణా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పోలీసు అధికారులు పలు సూచనలు ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి ఇజితెమాకు ముస్లింలు భారీగా తరలి రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ సమస్య వాటిల్లకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముందుగానే పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి ఆయా రూట్ల వెంట వచ్చే వాహనాలను ఎక్కడికక్కడే పార్కింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని సూచించారు. ఇజితెమాకు సుమారు వెయ్యి మంది వరకు పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈయన వెంట ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, అర్బన్ సీఐ రాము, ఎస్సై నారాయణరెడ్డి ఉన్నారు.

పెరిగిన పత్తి ధర

క్వింటా రూ.7,405

ఆదోని అగ్రికల్చర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కొత్త ఏడాది పత్తి ధరలు పుంజుకున్నాయి. శుక్రవారం పత్తి ధర క్వింటాలు గరిష్టంగా రూ.7,405 పలికింది. గత వారంతో పోల్చితే క్వింటానికి పత్తి ధర రూ.350పైగా ధర పెరిగింది. ధరలు మళ్లీ స్వల్పంగా పుంజుకోవడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దూది ధరలు పత్తి గింజల ధరలు పెరగడం వల్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. 3,846 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ట ధర రూ.4,300, గరిష్ట ధర రూ.7,405, మధ్యధర రూ.7,169 పలికింది.

ప్యాపిలి టూ ఇరాన్, ఇరాక్

- ఏటా వేల టన్నుల అరటి విదేశాలకు
- అక్కడ డిమాండ్‌తో ధరలు ఆశాజనకం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్యాపిలి అరటికి ఇరాన్, ఇరాక్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి అరటి పండ్లను తినడానికి ఆ దేశస్తులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏటా ప్యాపిలి నుంచి ఇరాన్, ఇరాక్ దేశాలకు వేల టన్నుల అరటి ఎగుమతి అవుతోంది. విదేశాల్లో డిమాండ్ ఉండటంతో ఇక్కడి అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.



ప్యాపిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలంలోని నల్లమేకలపల్లి, హుసేనాపురం, పీఆర్‌పల్లి, పెద్దపా య, వీకేపురం, బోయవాండ్లపల్లి, గుడిపాడు, రాచవాండ్లపల్లి తదితర గ్రామాల రైతులు అధికంగా అరటిని సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.లక్ష నుంచి లక్షన్నర పెట్టుబడి పెట్టి పంటను సాగు చేస్తున్నారు. 15ఏళ్ల క్రితం ఏదో కొంత మంది రైతులు అరటిని సాగు చేసేవారు. అయితే మండలంలోని భూములు అరటికి అనుకూలంగా ఉండటం, ప్రభుత్వం రాయితీలు కల్పించడంతో ప్రస్తుతం వేలాది ఎకరాల్లో రైతులు పంటను సాగు చేస్తున్నారు.



కెమికల్‌తో అరటి కాయలను శుభ్రపరుస్తున్న దృశ్యం

జీ9 రకం అరటికి మంచి డిమాండ్

జీ9 రకం అరటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ రకం అరటి మంచి పోషకాలతోపాటు రుచికరంగా ఉంటాయి. మిగితా రకం అరటితో పోల్చుకుంటే జీ9 ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. దీనివల్ల విదేశాల్లో వ్యాపారులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఫ్రూట్ కేర్ యాక్టివిటీతో కాయలకు నాణ్యత

ఫ్రూట్ కేర్ యాక్టివిటీతో నాణ్యతగా అరటి దిగుబడులు వస్తాయి. కాయల సైజు బాగా ఉంటాయి. ఈ పద్ధతిని పలు విదేశాల్లో రైతులు పాటిస్తున్నారు. అదే తరహాలో రాష్ట్రంలో కూడ ఫ్రూట్ కేర్ యాక్టివిటి పద్ధతిని అవలంబిస్తున్నామని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. దీని ద్వారా అరటి గెలలకు కవరు ఏర్పాటు చేసి, కాయలు నాణ్యతగా రావడానికి ఇంజక్షన్ ద్వారా మందుల వేస్తారు.



తోటల నుంచి కోసిన అరటి గెలలు



ప్యాపిలి మండలంలో పండిన జీ9 రకం అరటి



అరటిని విదేశాలకు తరలించేందుకు వ్యాపారులు ఏర్పాటు చేసిన బాక్సులు

2500 ఎకరాల్లో అరటి సాగు

మండలంలో 2500 ఎకరాల్లో జీ9 రకం అరటిని రైతులు సాగు చేస్తున్నారు. ప్యాపిలి మండలంలోని నల్లమేకలపల్లి, చంద్రపల్లి, మెట్టుపల్లి, పీఆర్‌పల్లి, గుడిపాడు, బోయవాండ్లపల్లి, వీకేపురం తదితర గ్రామాల్లో ఈ రకం అరటికి అనుకూలమైన భూములు ఉన్నాయి. ఈ రకం అరటికి ప్యాపిలి మండలంలో తప్ప జిల్లాలో ఎక్కడ అనుకూలమైన సారవంతమైన భూములు లేవని అధికారులు చెబుతున్నారు. అందువల్ల ఇక్కడి రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

ఐదేళ్లుగా విదేశాలకు ఎగుమతులు

ప్యాపిలి మండలం నుంచి ఐదేళ్లుగా అరటి కాయలు ఇరాన్, ఇరాక్ దేశాలకు ఏటా దాదాపు 10వేల టన్నుల అరటిని ఎగుమతి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడ అరటి తోటలు కొన్న వ్యాపారులు రైలు వ్యాగిన్‌ల ద్వారా ముంబాయి, నాగపూర్ పట్టణాలకు తరలించి అక్కడ నుంచి విదేశాలకు విమానాల ద్వారా ఎగుమతి చేస్తున్నారు.

టన్ను అరటి ధర రూ.60 వేలు

ఇరాన్, ఇరాక్ దేశాల్లో ప్యాపిలి అరటి టన్ను ధర రూ.60 వేలు పైనే పలుకుతున్నట్లు తెలుస్తోంది. దీంతో విదేశాలకు ఎగుమతి చేసే మహారాష్ట్ర కంపెనీలు ఇక్కడికి వచ్చి అరటిని కొంటున్నాయి. టన్ను రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు కొంటున్నారు.

పండ్ల తోటలకు రూ.1.21 కోట్లు విడుదల

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పండ్ల తోటల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.21 కోట్ల నిధులను విడుదల చేసిందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు. పండ్ల తోటల విస్తరణకు రూ.35.95 లక్షలు, హైబ్రిడ్ కూరగాయల సాగుకు రూ.21.16 లక్షలు, పూలతోటల సాగుకు రూ.8.27 లక్షలు, రెండో సంవత్సరం యాజమాన్యం పనులకు రూ.3.61 లక్షలు, మూడో సంవత్సరం యజమాన్యం పనులకు రూ.5.83 లక్షలు మంజూరయ్యాయి. అదేవిధంగా మామిడి పాత తోటల పునరుద్ధరణకు రూ.11.87 లక్షలు, రక్షిత సాగు కోసం రూ.5.56 లక్షలు, కోత అనంతరం నిల్వ చేసేందుకు ప్యాక్ హౌస్‌ల నిర్మాణానికి రూ.5.70 లక్షలు, యాంత్రీకరణకు రూ.23.16 లక్షలు, తేనేటీగల పెంపకానికి రూ.56వేలు విడుదలయ్యాయి.జ నేషనల్ మిషన్ (నూనె గింజలసాగు) అభివృద్ధి కింద ఆయిల్ ఫాం తోటల పెంపకానికి రూ.25.96 లక్షలు, మొదటి సంవత్సరం నిర్వహణకు రూ.3.87 లక్షలు, జాతీయ వెదురు మిషన్‌లో మొక్కల ఖర్చుకు రూ.2.08 లక్షలు మంజూరయ్యాయి.

ఐసీయంఆర్‌కు ఐదు ప్రాజెక్టులు



అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు హస్పిటల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని భారతీయ వైద్య పరిశోధన సంస్థ (ఐసీఎంఆర్) దేశ వ్యాప్తంగా వైద్య విద్యార్థుల పరిశోధన ప్రతిపాదనలో కర్నూలు మెడికల్ కాలేజీకి చెందిన ఫార్మాకాలజీ నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. దేశంలోని మెడికల్ కాలేజీ నుంచి సేకరించిన ప్రతిపాదన స్వీకరణలో ఫార్మాకాలజీ విభాగానికి చెందిన విద్యార్థుల పరిశోధనలకు ఐసీఎంఆర్ అనుమతి లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం కర్నూలు మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి. చిట్టినరసమ్మ వైద్య విద్యార్థులను, ఫార్మాకాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజేష్‌ను అభినందించారు. వైద్యవిభాగంలో పరిశోధన నిమితం ఐసీఎంఆర్ ప్రతిష్ఠాత్మకంగా వీటిని ఎంపిక చేస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఫార్మాకాలేజీ హెచ్‌ఓడీ రాజేష్ మాట్లాడుతూ తమ విభాగానికి చెందిన వైద్య విద్యార్థుల ఐదు పరిశోధన ప్రాజెక్టులకు ఐసీఎంఆర్ నుంచి అనుమతి లభించడం సంతోషంగా ఉందన్నారు. పరిశోధనకు ఎంపికైన వైద్య విద్యార్థులు సాహితి, సుమేధ, శివసోకిత్, మహ్మద్, అఖిల్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.

మహిళా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

148 మంది ఎంపిక



ఫిజకల్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ జి. బిందుమాధవ్, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణీ

కర్నూలు క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం నాల్గవ రోజు కొనసాగాయి. స్థానిక ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలను ఎస్పీ జి. బిందుమాధవ్ పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 739 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 301 మంది బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టుల్లో 1600 మీటర్ల పరుగు పరీక్షలో 198 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 50 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 146 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ (ఫైనల్) పరీక్షకు నాల్గవ రోజు 148 మంది మహిళా అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాటకరంగానికి ఆదరణ

- నాటక, సాహితీ సభలకు నిలయం టీజీవీ కళాక్షేత్రం
- నాటకరంగానికి సుబ్బరాయశర్మ సేవలు ప్రశంసనీయం
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- ముగిసిన రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు



డాక్టర్ జి.రవికృష్ణను సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, సుబ్బరాయశర్మ, పత్తి ఓబులయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో నాటక రంగానికి, కళలకు ఆదరణ ఎప్పటికీ ఇలాగే కొనసాగుతుందని రాజ్యసభ మాజీ సభ్యుడు, మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. మూడు రోజులుగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగిన రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు శుక్రవారం ముగిశాయి. నాటకోత్సవాల ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ నగరంలోని టీజీవీ కళాక్షేత్రం కళా ప్రదర్శనలకు, సాహిత్య సభలకు నిలయంగా తీర్చిదిద్దామని తెలిపారు. కళలకు, కళాకారులకు తమ ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. నాటకం, టీవీ, సినిమా రంగాలకు దాదాపుగా 50 ఏళ్ల సేవలు అందించిన సుబ్బరాయశర్మ కృషి ప్రశంసనీయమని అన్నారు. చిత్ర నిర్మాత బీవీ రెడ్డి మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం, హైదరాబాదు మహతి క్రియేషన్స్ సంయుక్తంగా మూడు రోజుల నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం హర్షదాయకమని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ ప్రతిభను ఈ నాటకోత్సవాల్లో చాటి చెప్పారని వారిని అభినందించారు. కళారంగం బతికి ఉన్నప్పుడే మన సంస్కృతి జీవిస్తుందని అన్నారు. జిల్లా ఏఎస్పీ హుస్సేన్ పీరా మాట్లాడుతూ సాంఘిక నాటకాలు మన జీవితానికి అద్దం వంటివని, సమస్యలను ప్రేక్షకుల ముందుకు తీసుకువెళ్లడానికి నాటకం ఒక మంచి సాధనంగా నిలుస్తోందని అన్నారు. సినీ, టీవీ నటుడు సుబ్బరాయశర్మ మాట్లాడుతూ కర్నూలులో నాటకరంగానికి మంచి ఆదరణ ఉందన్నారు. తనకు కర్నూలుతో ఉన్న అను బంధంతో ఈ ఏడాది ఇక్కడ నాటకోత్సవాలు ఏర్పాటు చేశామన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ చాలాకాలం తర్వాత ఏర్పాటు చేసిన ఈ నాటకోత్సవాలు ప్రేక్షకులకు ఆనందాన్ని పంచాయని చెప్పారు.



'ఉక్కు సంకెళ్లు' నాటికలోని ఒక దృశ్యం

కళాకారులకు నగదు ప్రోత్సాహం

నంద్యాలలోని కళారాధన సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గుర్రాల రవికృష్ణను అతిథులు, సుబ్బరాయశర్మతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రవికృష్ణ మాట్లాడుతూ వైద్య రంగంతోపాటూ కళారంగాన్ని సమస్థాయిలో ముందుకు తీసుకువెళ తున్నామని అన్నారు. కళారాధన సంస్థ ద్వారా నంద్యాలలో సాంఘిక నాటకాలకు జీవం పోస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం లో సుబ్బరాయశర్మ జన్మదినం సందర్బం గా ఆయన కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే జిల్లాకు చెందిన కళాకారులు సరస్వతమ్మ, సర్వోత్తమ రెడ్డిలకు మహతి క్రియేషన్స్ తరపున రూ.5వేలు చొప్పున ఇరువురికి నగదును సుబ్బరాయశర్మ అందజేశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన నంది అవార్డు గ్రహీత శామ్యూల్‌కు వైద్య సహాయం నిమిత్తం కళాక్షేత్రం తరపున పత్తి ఓబులయ్య రూ.30 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. మున్ముందుకూడా వైద్య సహాయం అవసరం ఉంటే తగిన సహాయ సహకారాలు కళాక్షేత్రం తరపున అందిస్తామని చెప్పారు. మహతి క్రియేషన్స్ ప్రతి నిధి పోతరాజు జ్యోతి ప్రజ్వ లన చేసి ప్రారం భించిన ఈ కార్యక్రమంలో చివరగా సుబ్బ రాయశర్మ దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఉక్కు సంకెళ్లు' నాటిక ప్రేక్షకులను అలరింపజేసింది.

నేడు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ శనివారం నందికొట్కూరు రోడ్డులోని వెంకాయపల్లె దగ్గర ఉన్న రవీంద్ర గ్లోబల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ శుక్రవారం తెలిపారు. పాఠశాల, మండల స్థాయి పోటీల్లో ఎంపికైన ప్రాజెక్టులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్నాయని అన్నారు. భౌతిక, రసాయనశాస్త్రాలు, గణితం, ఎర్త్ సైన్స్, పర్యావరణం, ఇంజనీరింగ్, బయో సైన్స్, బయో కెమిస్ట్రీ కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించిన ఉప అంశాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన నమూనాలో 26 వ్యక్తిగత ప్రాజెక్టులు, 26 గ్రూప్, టీచర్ల వారీగా ప్రాజెక్టులు ఉంటాయని అన్నారు. శాస్త్రీయ దృక్పథం, సామాజిక ప్రయోజనకారిగా ఉన్న ప్రాజెక్టులను మాత్రమే ప్రదర్శించాలన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, పాఠశాలల నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుతో సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో పాల్గొనాలని సూచించారు. జిల్లా స్థాయిలో పాల్గొన్న ప్రాజెక్టుల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి విజయవాడలో రెండో శనివారంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని డీఈవో తెలిపారు. జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను పూర్తయినట్లు జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ తెలిపారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ ఉదయం 8 గంటలకే చేరుకోవాలని ఆమె తెలిపారు.

3 న్యూసిటీ-01 మాట్లాడుతున్న ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి

సంక్రాంతికి నూతన రహదారులు

పీఆర్ ఎస్ఈ వి. రామచంద్రారెడ్డి



కర్నూలు, న్యూసిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీరాజ్ ఎస్ఈ వి. రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జాతీయ రహదారులు, జిల్లా ప్రధాన రహదారులకు ఇతోధికంగా నిధులు విడుదల చేస్తూనే, గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గ రోడ్లకు కూడా నిధులు మంజూరు చేసిందన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 84 కిలోమీటర్ల మేర రూ.68 కోట్లతో 828 సీసీ రోడ్లు, 2 బీటీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. 830 పనులకు గాను ఇప్పటి వరకు జిల్లాలో 715 పనులు పూర్తి అయ్యాయన్నారు. మిగిలినవి ప్రొగ్రెస్‌లో ఉన్నాయన్నారు. వాటిని సంక్రాంతికి పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఎస్ఈ తెలిపారు.

ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త రీచ్‌లను ఎప్పటికప్పుడు గుర్తించి ఇసుకను ప్రజలకు అందుబాటులోకి ఉండేలా చర్యలు తీసుకోవాలని గనుల శాఖ ప్రిన్సిపాల్ ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఇసుక సరఫరా అంశంపై గనుల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక నిల్వలు పెంచేందుకు కొత్త ఇసుక రీచ్‌లను ఎప్పటికప్పుడు గుర్తించి ఇసుకను ప్రజలకు అందుబాటులోకి ఉంచాలన్నారు. వాటికి అవసరమైన పర్యావరణ అనుమతులు త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పాల్గొన్నారు.

సూర్యాస్తమయ సౌందర్యం..!



కందనవోలు నగర శివారున.. ఆకాశ వీధిలో సూర్యాస్తమయ శోభ అబ్బురపరిచింది. ఆకాశాన ఎర్రటి తివాచి పరిచినట్లు అస్తమిస్తున్న సూర్యుడు చూడముచ్చటగా కనిపించాడు. ఆ అందమైన సూర్యుడి అందాలను అంజనీపుత్రుడు ఆస్వాదిస్తున్నట్లు ఉన్న ఈ చిత్రం చూపరులను కట్టిపడేసింది. రోజంతా పసుపు బంగారు కాంతితో ప్రకాశించిన సూర్యుడు... సాయంత్రం మాత్రం ఇలా ఎరుపు రంగులో కనిపించాడు. ఆ సమయంలో ఆకాశం సైతం అనేక రంగుల్లో కనిపించింది. ఎరుపు, నారింజ, నీలం, పసుపు, ఊదా రంగులు ఆకాశం అంతటా వ్యాపించాయి. జగన్నాథగట్టుపై వినువీధిలో ఆవిష్కృతమైన ఈ సుందర దృశ్యాన్ని శుక్రవారం సాయంత్రం ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది.

ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు (ఆంధ్రజ్యోతి).

పట్టు చీరల కోసం వెళ్లి పరలోకానికి...

'అనంత'లో రోడ్డు ప్రమాదం...

తుగ్గలి మండలానికి చెందిన దంపతుల దుర్మరణం


రాజశేఖర్‌చౌదరి, సుమలత (ఫైల్)

పెద్దవడుగూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మరో నెల రోజుల్లో జరిగే గ్రామ జాతర కోసం పట్టు చీరలు కొనేందుకు వెళ్లి తిరిగి వస్తున్న వారికి అదే చివరి ప్రయాణమైంది. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో కిష్టిపాడు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజశేఖర్‌చౌదరి (28), సుమలత (25) దంపతులు మృతిచెందారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టింది. 67వ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెన్నంపల్లికి చెందిన రాజశేఖర్ చౌదరి, సుమలత దంపతులు పట్టు చీరల కోసం యాడికి మండల కేంద్రానికి ద్విచక్ర వాహనంలో వచ్చారు. తమ గ్రామంలో ఫిబ్రవరిలో ఊరి జాతర ఉండటంతో పట్టు చీరలు కొనుగోలు చేశారు. స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా గుత్తి వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరూ ఎగిరి రోడ్డు పక్కనపడ్డారు. తీవ్ర గాయాలతో అక్కడి కక్కడే మృతిచెందారు. బొలెరో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకు వెళ్లింది. యాడికి పట్టణానికి చెందిన డ్రైవర్ సాయి మద్యం మత్తులో వాహనాన్ని నడిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో సాయి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు సందర్శించారు. మృతదేహాలను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజశేఖర్ చౌదరి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతిచెందిన దంపతులకు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కంది మిషన్‌లోపడి మహిళ మృతి

తుగ్గలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కంది పంటను నూర్పిడి మిషన్‌లో వేస్తుండగా.. ప్రమాదవశాత్తు అనంతమ్మ (45) అనే మహిళ తల మిషన్‌లో పడి మృతి చెందింది. శుక్రవారం మండలంలోని రామలింగాయపల్లెలో మాధవయ్య, హనుమంతమ్మ దంపతులు కౌలు పొలంలో వేసిన కంది పంటను మిషన్‌లో వేస్తుండగా.. అనంతమ్మ చీర మిషన్‌లో పడి లాగేసుకుంటుండగా.. ఆమె తల లోపలికి వెళ్లి గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. జొన్నగిరి పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్వర్లు, సీపీఐ నబీ రసూల్ సంఘటనా స్థలానికి చేరుకుని అనంతమ్మ భౌతిక కాయానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

నీటి వనరుల ఆక్రమణలను తొలగించాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి వనరుల ఆక్రమణలను తొలగించే చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య నీటి వనరులు, చెరువులు భూముల జిల్లా స్థాయి పరిరక్షణ కమిటీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నీటి వనరులు, చెరువుల భూముల జిల్లా స్థాయి పరిరక్షణ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులు, వాటి సమీపంలో ఎలాంటి ఆక్రమణలు ఉన్నా, వాటిపై సర్వే చేసి పూర్తి వివరాలను ఆదివారంలోపు సమర్పించాలని కమిటీని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలు తాత్కాలికంగా నిర్మించారా? లేక పర్మినెంట్‌గా ఉండేలా నిర్మించారా..? అన్న విషయాలను సేకరించాలన్నారు. రెవెన్యూ వారు, ఇరిగేషన్ డిపార్టుమెంట్, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సి. వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డీపీవో భాస్కర్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు తదితరులుపాల్గొన్నారు.

మాట తప్పిన చంద్రబాబు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు చేసిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పాడని, ఇందులో ఆయనకు బ్రాండ్ ఇమేజ్ ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డిఅన్నారు. శుక్రవారం ఎస్వీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి మండలి సమావేశంలో ప్రజలు ఆశించిన అమ్మఒడి పథకాన్ని వచ్చే సంవత్సరం నుంచి అమలు చేస్తానని ప్రకటించడంతో తల్లితండ్రులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ సుభాష్ చంద్రబోసు, కార్పొరేటర్లు క్రిష్ణకాంత్‌రెడ్డి, షాషావలి, రాజేశ్వరరెడ్డి, నాయకులు షరీఫ్, మల్లి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి నందివర్గం విద్యార్థి మృతి


సాయిసంతోష్ (ఫైల్)

బనగానపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్రాసులో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న నందివర్గం గ్రామానికి చెందిన సాయిసంతోష్‌రెడ్డి (18) సముద్రంలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. ఈ ఘటన మద్రాసు మెరీనా బీచ్‌లో చోటు చేసుకుంది. పాణ్యం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన వెంగళరెడ్డి కుటుంబం నందివర్గంలో స్థిరపడింది. ఆయన రెండవ కుమారుడు సంతోష్‌రెడ్డి మద్రాస్‌లోని సవితా యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తన తోటి స్నేహితులతో కలసి ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆమె ప్రత్యేక చొరవ తీసుకొని సంతోష్‌రెడ్డి మృతదేహాన్ని వెలికి తీయాలని తమిళనాడు సీఎం స్టాలిన్‌కు లేఖ రాయగా తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సంతోష్‌రెడ్డి మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. ఎన్నో ఆశలతో మద్రాసుకు చదువు కోసం పంపిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని తీసుకోవడాని మద్రాసు వెళ్లారు. కాగా వెంగళరెడ్డికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు నందివర్గంలో వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు.

సంచార వాహనాల్లో కూరగాయల విక్రయం

● జాయింట్ కలెక్టర్ బి.నవ్య

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలను అదుపులో ఉంచడంతో పాటు ప్రజల ఇళ్ల వద్దకే నాణ్యమైన కూరగాయలను చేర్చి విక్రయించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య కోరారు. శుక్రవారం కర్నూలు నగరంలోని సీ. క్యాంపు రైతుబజారులో కూరగాయల సంచార వాహనాన్ని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలను అందించేందుకు సంచార కూరగాయల వాహనాలను ఏర్పాటు చేశామని అన్నారు.

చిన్నవంగలి పాల డెయిరీ ఎన్నికల్లో ఉద్రిక్తత

● టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ
● బైఠాయించిన టీడీపీ నాయకులు
వాయిదాపడ్డ ఎన్నికలు ● గ్రామంలో పోలీసు పికెటింగ్


చిన్నవంగలి పాల కేంద్రం వద్ద బైఠాయించిన టీడీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో శుక్రవారం జరిగిన పాల డెయిరీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఉద్రిక్తంగా మారింది. రెండు డైరెక్టర్ పదవులకు నంద్యాల ఎన్నికల అధికారులు రామకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, పద్మయ్య అభ్యర్థుల నామినేషన్‌లు స్వీకరించేందుకు ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు, కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్ ఆధ్వర్యంలో పాల డెయిరీ వద్ద స్పెషల్ పార్టీలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుగా టీడీపీ వర్గానికి సంబంధించిన ఇద్దరు నామినేషన్లు వేశారు. అనంతరం వైసీపీ వర్గానికి చెందిన వారు నామినేషన్లు వేసేందుకు పాల డెయిరీ వద్దకు వచ్చారు. వారితో నామినేషన్ వేయించేందుకు పోలీసు అధికారులు సహకరించి వారిని కేంద్రం లోపలికి పంపించి గేట్లు వేశారు. టీడీపీ నాయకులను కేంద్రం వద్దకు రానివ్వకుండా పోలీసు అధికారులు అడ్డుకున్నారు. దీంతో కేంద్రం వద్ద పోలీసు అధికారులకు, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం నెలకొంది. పోలీసు అధికారులు ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. టీడీపీ మండల కన్వీనర్, న్యాయవాది నరసింహారెడ్డి కేంద్రం వద్దకు చేరుకొని పోలీసులతో మాట్లాడుతుండగా టీడీపీ నాయకులను, మండల కన్వీనర్‌ను పోలీసులు బయటకు లాగారు. ఈ ఘటనలో మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టీడీపీ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి వేసుకున్న దుస్తులు చినిగి పోయాయి. దీంతో వారు అర్ధనగ్నంగా కేంద్రం వద్ద బైఠాయించి పోలీసుల తీరుకు నిరసన ప్రకటించారు. సీఐలు, ఎస్ఐ హరిప్రసాద్ కలుగజేసుకొని శాంతిభద్రతలకు భంగం కలిగించరాదని, అక్కడి నుంచి నుంచి వెళ్లిపోవాలంటూ చెప్పడంతో అక్కడి నుంచి టీడీపీ వర్గీయులు వెనుతిరిగి వెళ్లారు. ఎస్పీ ఆదేశాల మేరకు నంద్యాల సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ హరిప్రసాద్, స్పెషల్ పార్టీ పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తుగా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

● వాయిదా పడ్డ పాల డెయిరీ ఎన్నికలు

చిన్నవంగలి పాల డెయిరీ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ నెలకొనడంతో శాంతి భద్రతల దృష్ట్యా పోలీసు అధికారుల ఆదేశాలతో ఎన్నికలు వాయిదా వేశామని ఎన్నికల అధికారి రామకృష్ణారెడ్డి, నాగిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలు వాయిదాపడ్డాయని పాల డెయిరీ కేంద్రం గోడకు పేపర్ అతికించారు. తిరిగి ఎన్నికల తేదీ ప్రకటిస్తామని అందులో పేర్కొన్నారు.

వైసీపీలో విభేదాలు

● శిలాఫలకంలో పేరు లేదని పగులకొట్టే యత్నం


శిలాఫలకంలో పేరు లేదంటున్న ఉప సర్పంచ్ ప్రమీలమ్మ దంపతులు

మద్దికెర, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మద్దికెర వైసీపీలో విభేదాలు నెలకొన్నాయి. శిలాఫలకంలో సర్పంచ్ పేరు లేకపోవడంతో ఈ విభేదాలు బట్టబయలయ్యాయి. మద్దికెర మెయిన్ బజారులో రూ.22 లక్షలతో నాబార్డు, పంచాయతీ నిధులతో కలిపి నాబార్డు కూరగాయల మార్కెట్ ప్రారంభ శిలాఫలకం వేయించారు. అయితే అందులో ఉప సర్పంచ్ ప్రమీలమ్మ పేరు లేకపోవడంతో ఆమె భర్త రామాంజులు, అనుచరులు ఆ శిలాఫలకాన్ని పగులకొట్టేందుకు యత్నించారు. వ్యాపారుల సౌకర్యార్థం కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను 2వ తేదీన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేయించిన శిలాఫలకంలో జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, కాంట్రాక్టర్ల పేర్లన్నీ ఉన్నాయి. గ్రామ ఉప సర్పంచ్ ప్రమీలమ్మ పేరు మాత్రం వేయించలేదు. దీంతో ఆగ్రహించిన భర్త రామాంజులు శిలాఫలకాన్ని రాళ్లతో పగులగొట్టగా నెర్రెలిచ్చింది. ఒకే పార్టీలో ఉంటూ అందరి పేర్లు వేసి కావాలనే తమ పేరు రాయలేదంటూ ఆయన ఆరోపిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌తో వాగ్వాదానికి దిగాడు. గ్రామంలో ముగ్గురు ఎంపీటీసీల పేర్లు వేసినప్పుడు, తమ పేర్లు ఎందుకు వేయలేదని నిలదీశాడు.

పెట్రోల్ బంకులో ఘరానా మోసం

● అనుమానం వచ్చి కొలిచిన ద్విచక్ర వాహనదారుడు
● తప్పైందని అంగీకరించిన నిర్వాహకులు


పెట్రోల్‌ను కొలుస్తున్న ద్విచక్ర వాహనదారుడు

ఆదోని రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెట్రోలు బంకు నిర్వాహకుల ఘరానామోసం బట్ట బయలైంది. ఆస్పరి బైపాస్‌లో ఉన్న ఓ పెట్రోల్ బంకుకు మండలం గణేకల్లు గ్రామానికి చెందిన గౌండా పాండురంగ శుక్రవారం కె.ఏ 01ఈటి 3288 ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. బెంగుళూరుకు వెళుతూ మార్గమధ్యంలో ఆదోని ఆస్పరి బైపాస్‌లో ఉన్న లక్ష్మీ చెన్నకేశవ హెచ్‌పీ పెట్రోల్ బంకుకు వెళ్లాడు. రూ.1210/-లు పెట్రోలు వేయించుకున్నా ట్యాంకు నిండకపోవడంతో అనుమానం వచ్చి బండి ట్యాంకులో పోసిన పెట్రోల్‌ను చెక్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో నిర్వాహకులు బండిలో ఉన్న పెట్రోలును కొలిచారు. దాదాపు 12లీటర్లు ఉండాల్సిన చోట 8లీటర్లే తేలింది. దీంతో ద్విచక్ర వాహన దారుడు పెట్రోల్ బంకు నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగాడు. దీంతో పెట్రోలు బంకు సిబ్బంది తప్పైందని అంగీకరించారు. డబ్బులు ఇస్తామని, ఇంకోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని చెప్పి నగదు వాపసు ఇచ్చాను.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మహానంది, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చలమ-దిగువమెట్ట రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం ఉదయం 9గంటల సమయంలో రైలుకింద పడి మృతి చెందినట్లు నంద్యాల రైల్వే ఎస్సై అబ్దుల్ జలీల్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. మృతుడు బ్లూ కలర్ చొక్కా, ఎర్రమట్టి కలర్ బనియన్, నల్లని ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడు సుమారు 5.6అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.













ఎస్ఎంసీ కమిటీలదే కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మేరీ సునీత

గడివేముల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధిలో ఎస్ఎంసీ కమిటీలదే కీలక పాత్ర అని ఎంఈవో మేరీసునీత అన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఎస్ఎంసీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా పాఠశాలలో ఎస్ఎంసీ కమిటీ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధిపై చర్చించాలని కోరారు.



ఆత్మకూరులో సావిత్రీబాయి, పూలే వేషధారణలో విద్యార్థులు



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకుల

సావిత్రీబాయి సేవలు

చిరస్మరణీయం



పాములపాడులో సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఏపీఎం

ఆత్మకూరు, జనవరి 3: సంఘ సంస్కర్త, దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రీబాయి పూలే సేవలు చిరస్మరణీయమ ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ అన్నారు. శుక్రవారం సావి త్రీబాయి 194వ పూలే జయంతి వేడుకలను పురస్కరించుకుని స్థానిక ఆ సంఘం కార్యాల యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా విద్యతో మహిళలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని భావించిన మహనీ యురాలు సావిత్రీబాయి పూలే అని అన్నారు. 1848లో భర్తతో కలిసి జనవరి 1 తేదీన పూణే లో మొట్టమొదటి సారిగా బాలికల పాఠశాలను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. కుల వ్యవస్థ, పితృ స్వామ్యానికి వ్యతిరేకంగా, మహిళల హక్కులు, సంక్షేమం కోసం సామా జిక బాధ్యతతో పోరాటాలు సాగించినట్లు తెలిపారు. అతి సామాన్యమైన కుటుంబంలో జన్మించినప్పటికీ మహిళా లోకానికే ఆదర్శంగా నిలిచిన సావిత్రీబాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. అలాగే బాలికా విద్యను ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో వీరన్న, శ్రీహరి, పెద్దనాగన్న, వెంకటేశ్వర్లు, పెద్దన్న, వెంకటేశ్వర్లు, ఎల్లప్ప ఉన్నారు.

● ఆత్మకూరు పట్టణంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం సావి త్రీబాయిపూలే 194వ జయంతిని పురస్కరిం చుకొని ఆమె చిత్రపటానికి పాఠశాల కరస్పాం డెంట్ తాజుద్దిన్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే మహిళా విద్యాభివృద్ధి కోసం ఎనలేని సేవలందించాలని అన్నారు.

● **పాణ్యం:** భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే ఆశ యాలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ నిరంజన్ అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతిని శుక్రవారం మోడల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్ చార్జి ప్రిన్సిపాల్ వీరేష్, సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షులు శివకృష్ణ యాదవ్. ఏఐఎస్‌బీ నాయకులు వెంకటాద్రి, ఎస్ఎస్ యూఐ నాయకులు ప్రతాప్, మౌర్య హాస్పిటల్ డాక్టర్ హరిప్రసాద్, సివిల్ ఇంజనీరు మద్దయ్య, విద్యార్థి సంఘం నాయకులు రాజు, బాలకృష్ణ నాయక్ సుభాష్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

● **పాములపాడు:** పాములపాడులోని వెలుగు కార్యాలయంలో గ్రామ సర్పంచ్ సౌభాగ్యమ్మ టీడీపీ నాయకులు మధుక్రిష్ణ, ఏపీఎం ఉమాదేవి, అంగన్‌వాడీ మండల నాయకురాలు శివలక్ష్మి, ఎమ్మార్పీఎస్ నాయకు డు స్వాములు ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. శుక్రవారం ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక భారత దేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని, పీడిత ప్రజలు, స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి మహిళా ఉద్యమ కారిణి అన్నారు. కార్యక్రమంలో సీసీ సౌభాగ్యమ్మ పాల్గొన్నారు.

● **వెలుగోడు:** మహిళల విద్యాభివృద్ధి కోసం సావిత్రీబాయి పూలే చేసిన సేవలు ఆదర్శమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహ కోశాధికారి కృష్ణార్జునరెడ్డి అన్నా రు. శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవో బ్రహ్మంనాయక్ సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ హెడ్గే పాల్గొన్నారు.

● **నందికొట్కూరు:** సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా సంఘం జిల్లా నాయకురాలు బీబీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సావిత్రీబాయి జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసని అన్నారు. కానీ సావిత్రీబాయి ఆధునిక భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయు రాలు అని ఆయన తెలిపారు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారి అని ఆయ న కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సం ఘం నాయకులు బీబీ మల్లేశ్వరమ్మ, ముత్తు జాబి, రైతు సంఘం జిల్లా నాయకులు వేల్పుల ఏసన్న, ఇస్రాయిల్, కార్మిక సంఘం జిల్లా నాయకులు షేక్షావలి, మహబూబ్ బాషా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



వెలుగోడులో ఉపాధ్యాయినులను సన్మానించిన దృశ్యం

మహానందిలో పల్లకి సేవ



పల్లకి సేవ ఉత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

మహానంది, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకి సేవను ఆలయ వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలోకి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాచమల్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ

నంద్యాల కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల గాంధీ చౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం కాళికాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఈవో లక్ష్మీనారాయణ, అర్చక ఆధ్వర్యంలో సాయంత్రం అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని అలంకరించి పల్లకిలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి

ఆత్మకూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ చింతల మోహన్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప సభను పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మహోన్నత వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి గొప్ప పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్వర్ణోత్సవ శోభ

ఆత్మకూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ శోభను సంతరించుకుంది. కళాశాల ఏర్పాటై 50 ఏళ్లను పురస్కరించుకుని శని, ఆదివారాల్లో కళాశాలలో జరుగుతున్న స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల భవనాన్ని విద్యుద్దీప కాంతులతో సుందరీకరించారు. రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకలను పురస్కరించుకొని ఇప్పటికే కళాశాలను అన్ని హంగులతో తీర్చిదిద్దారు. తొలి రోజు విశిష్ట అతిథులతో స్వర్ణోత్సవ వేడుకకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలతో పాటు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో నిలిచిన పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఉంటాయి.



విద్యుద్దీపాలతో అలంకరించిన కళాశాల భవనం

సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె కాలపు ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పెద్ద నాగరాజు, తిమ్మయ్య, రాజు, సువర్ణమ్మలు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట మున్సిపల్ కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరికీ రూ.1000 ఇవ్వాలని అన్నారు. రిటైర్డుమెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియో, దహన సంస్కరణల ఆర్థిక సాయాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో జయన్న, బాలరాజు, నాగన్న, సురేష్, దర్గయ్య, చిన్నలింగస్వామి, సుగుణమ్మ పాల్గొన్నారు.

రోడ్ల నాణ్యత పరిశీలన



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాద్రి

కొత్తపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వేసిన రోడ్ల నిర్మాణాలను శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాద్రి, సామాజిక తనిఖీ శాఖ డీఆర్పీ మణికంఠలు తనిఖీ చేశారు. ముందుగా జగనన్న కాలనీలోని గ్రావెల్ రోడ్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని కొలతలు తీశారు. అదేవిధంగా ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా నిర్మించిన మెయిన్ రోడ్డులోని సీసీ రోడ్డు కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో పక్కా కొలతల్లో రోడ్లు నిర్మించారా లేదా అని పరిశీలించామని అన్నారు. తదుపరి నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. అలాగే నూతనంగా రైతు నిర్మించుకుంటున్న గొర్రెల షెడ్లను తనిఖీ చేసి కొలతలు వేశామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్, ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

శంఖారావాన్ని జయప్రదం చేయండి



వాహనాల పాసులను అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, జనవరి 3: హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ ఆత్మకూరు ప్రఖండ అధ్యక్షుడు గరుడాద్రి సుదర్శన్, ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ వాసుదేవరెడ్డి, జిల్లా ధర్మప్రసార ప్రముఖ్ శ్రీధర్‌గుప్తా అన్నారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో హైందవ శంఖారావానికి తరలి వెళ్లే వారికి వాహనాలకు పాసులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవవదాయ, ధర్మదాయ శాఖలో అన్యమతస్తులను తొలగించాలని అన్నారు. ఆలయాల పరిసరాల్లో హిందువులకు మాత్రమే దుకాణాలు కేటాయించాలని, అన్యాక్రాంతమైన దేవాలయాల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. జనవరి 5న తలపెట్టిన హైందవ శంఖారావం బహిరంగ సభకు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు వినోద్ కుమార్, మారం భానుమూర్తి, పవన్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హైందవ సంస్కృతితోనే విశ్వశాంతి



మాసపేట గ్రామంలో గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

మిడుతూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి పరిరక్షించబడినప్పుడే విశ్వశాంతి వర్ధిల్లుతుందని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. సకల ప్రాణులపట్ల దయ కలిగి ఉండాలని, దైవం దృష్టిలో అన్ని ప్రాణులు సమానమే అని ఆయన అన్నారు. మాసపేట గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ పర్వతరెడ్డి యుగంధర్‌రెడ్డి, గ్రామ పెద్దలు రఘునాథరెడ్డి, రామక్రిష్ణ, శేఖర్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, ప్రతాప్ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కమతం జ్యోతి, సాయివరరత్నం పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ

జూపాడుబంగ్లా, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 80బన్నూరు గ్రామంలో కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు రీ సర్వే ప్రాజెక్టు పట్ల అవగాహన శుక్రవారం మండల సర్వేయర్ డి.అతీఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ రీ సర్వే పట్ల రైతులకు అవగాహన కల్పించారు. మండలం లో రెండు టీంలుగా ఏర్పడి రైతుల భూములను సర్వే చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు సుధాకర్, వసీం అక్రం, సాయి బాబ, సిలార్ సాహేబ్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

పాములపాడు జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాములపాడు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం పాములపాడు టీడీపీ నాయకులు నబిరసూల్, మల్లికార్జున, లింగస్వామి, రాజు, ఉస్సేన్‌బాషాలు పుష్పగుచ్ఛాలు అందించారు. అధిక నిధులు కేటాయించి మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని వారు ఎమ్మెల్యేను కోరారు.

బాధితులకు పరామర్శ

మహానంది, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఘర్షణలో గాయపడిన వారిని మండల టీడీపీ నాయకుడు నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి పరామర్శించారు. శుక్రవారం మసీదుపురంలో రెండు రోజుల క్రితం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారి మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలకు చెందిన ఆరుగురు గాయపడ్డారు. వీరిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నరాల మౌళీశ్వరరెడ్డి ఆసుపత్రికెళ్లి బాధితులను పరామర్శించారు. సంఘటనా స్థలాన్ని మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. బాధితుడు ఆనందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శుక్రవారం రాత్రి తెలిపారు.

కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలు

నంద్యాల క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కడపలో ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించనున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు అన్నారు. శుక్రవారం నంద్యాలలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల లోగోను ఏఐవైఎఫ్ నాయకులు ఆవిష్కరించారు.

ఎన్‌సీడీ సీడీ సర్వే వేగవంతం చేయాలి



పెద్దబోదనంలో ఎన్‌సీడీ సీడీ సర్వేను పరిశీలిస్తున్న వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి

చాగలమర్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 సచివాలయాల పరిధిలో ఎన్‌సీడీ సీడీ సర్వే వేగవంతం చేయాలని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సూచించారు. శుక్రవారం పెద్దబోదనం గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడీ సీడీ సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులపై ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నామని అన్నారు. పుట్టుకతో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించామన్నారు. వారంలో ఐదురోజుల పాటు ఐదు కుటుంబాలను సర్వే చేసి వివిధ వ్యాధులను యాప్‌లో నమోదు చేస్తామని అన్నారు. హౌస్‌హోల్డ్ సర్వేను వైద్య సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రీ ఏఎన్ఎం పద్మావతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



చాగలమర్రిలో వాసవీమాతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి, కోదండరామ, చెన్నకేశవ, మద్దూరు ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం వేద పండితుల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలను వైభవంగా నిర్వహించారు. వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన చేశారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీరింప చేసి ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం గ్రామంలో కొలువుదీరిన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి నూతన వస్త్రాలను అలంకరించారు. ఆర్యవైశ్యులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

చౌడేశ్వరికి పూజలు

రుద్రవరంలో కొలువుదీరిన చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. అమ్మవారికి చీరలు, బోనాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ ధర్నా



పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్, కాంట్రాక్టు ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు, మున్సిపల్ కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు, ధర్నా చేశారు. నగర పంచాయతీలోని పని చేసే కార్మికులైనా డిస్ట్రిబ్యూషన్, వాటర్ వర్క్స్, పంప్‌హౌస్, ఫిల్టర్ బెడ్స్, స్ట్రీట్ లైటింగ్, ఇతర విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బేతంచెర్ల సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రంగడు, శ్రీను, 60 మందికి పైగా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు నాగన్న, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, కాశీ, రాజు, విజయ్, తిరుమలేష్, పద్మావతి, వెంకటలక్ష్మి, ఇందిరమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

- రింగ్ రోడ్డుకు రూ.50 కోట్ల నిధులు మంజూరు
- రెండు నెలల క్రితం ముగిసిన టెండర్ల ప్రక్రియ

బనగానపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గత ఏడు సంవత్సరాల నుంచి దోబూచులాడుతున్న రింగ్ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ.50 కోట్ల నిధులు మంజూరు కావడంతో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి త్వరలో భూమి పూజ చేయనున్నారు. గతంలోనే రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం రైతుల నుంచి 13.5 కిలోమీటర్ల మేర రహదారికి సంబంధించిన పొలాలను అధికారులు గుర్తించారు. రింగ్‌రోడ్డు నిర్మాణానికి 400మంది రైతుల నుంచి ఆయా గ్రామ సమీపాల్లో 72 ఎకరాలు పొలాలు రింగ్ రోడ్డు కోసం కేటాయించేలా ప్రణాళికలు అధికారులు సిద్ధం చేశారు. సగం మంది రైతులకు



బనగానపల్లెలో రింగ్ రోడ్డు కోసం సేకరించిన భూమి

నష్టపరిహారం చెల్లించారు. మిగతా రైతులకు నష్టపరిహారం అందించనున్నారు. అధికారులు భూసేకరణ పనులు మాత్రం ఎట్టకేలకు పూర్తి చేశారు. రెండునెలల క్రితం టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కావాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. యాగంటిపల్లె రహదారిలో ఈ పనులు ప్రారంభించి భూమి పూజ చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బనగానపల్లె నుంచి అవుకు సమీపంలోని ఎస్సార్బీసీ కాలనీ సమీపం నుంచి తమ్మడపల్లె గ్రామ సమీపం మీదుగా, బనగానపల్లె నుంచి కోవెలకుంట్ల రహదారిలోని ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్ మీదుగా, మిట్టపల్లె గ్రామ సమీపం మీదుగా, కర్నూలు రహదారిలోని బత్తులూరు గ్రామ సమీపం మీదుగా, బనగానపల్లె సమీపంలోని రవ్వలకొండ మీదుగా తిరిగి అవుకు రహదారిలోని సాయిబాబా ఆలయం వరకు రింగ్ రోడ్డు నిర్మాణం కలిపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్యాపిలి రస్తా నుంచి పాణ్యం రహదారి మీదుగా కర్నూలు ప్రధాన రహదారి వరకు, కర్నూలు రహదారి నుంచి బనగానపల్లె మీదుగా కోవెలకుంట్ల రహదారి వరకు, కోవెలకుంట్ల రహదారినుంచి ప్యాపిలి రహదారి వరకు రింగ్ రోడ్డు నిర్మించనున్నారు.

త్వరలో భూమి పూజ

త్వరలో రింగ్ రోడ్డు పనులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. ఈమేరకు సన్నాహాలు చేస్తున్నాం. మంత్రి బిజీగా ఉండడంతో తేదీ నిర్ణయించలేదు. మంత్రి సమయం ఇచ్చిన వెంటనే భూమి పూజ చేయించి పనులు ప్రారంభిస్తాం.
- హుసేన్, ఆర్అండ్‌బీ ఏఈ

తీరనున్న ట్రాఫిక్ సమస్య

రింగ్ రోడ్డు లేకపోవడంతో బనగానపల్లె పట్టంలో ట్రాఫిక్‌కు నిత్యం అంతరాయం కలుగుతోంది. ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. బనగానపల్లె సమీపంలోని యనకండ్ల వద్ద నిర్మించిన సిమెంట్ ఫ్యాక్టరీ, కొలిమిగుండ్ల మండలంలో నిర్మించిన రామ్‌కోసిమెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలు, ప్యాపిలి మండలంలోని బూరుగుల సమీపంలో నిర్మించిన ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీలు వెలిశాయి. ఫ్యాక్టరీలకు అవసరమైన బొగ్గు, సుద్ద, సిమెంట్‌ను, ఇతర ముడి ఖనిజాలను భారీ వాహనాల్లో బనగానపల్లె మీదుగా తరలిస్తుంటారు. దీంతో పట్టణంలో వందల సంఖ్యలో భారీవాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా బస్టాండ్ నుంచి పెట్రోల్ బంకు, అవుకు మెట్ట, పొట్టి శ్రీరాముల కూడలి, జీఎం టాకీస్‌ల వద్ద భారీ వాహనాల వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019 సంవత్సరంలో రూ.50 కోట్ల వ్యయంతో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రింగ్‌రోడ్డు నిర్మాణం పనుల కోసం భూమి పూజ కూడా చేశారు. కానీ, ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రింగ్ రోడ్డు నిర్మాణం పనులు ఆగిపోయాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, బీసీ జనార్దన్ రెడ్డి మంత్రి కావడంతో బనగానపల్లె వాసుల రింగ్ రోడ్డు కల నెలవేరనుంది.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం

- కమాల్‌సాహెబ్, పీఆర్ ఏఈ



రుద్రవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిలో భాగంగా సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామని పంచాయతీరాజ్ ఏఈ కమాల్‌సాహెబ్ అన్నారు. ఇందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. శుక్రవారం ఏఈ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న : ఎన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు?

జవాబు: మండలంలో 13 గ్రామాల్లో 26 సీసీరోడ్లు నిర్మిస్తున్నాం. ఇందుకు రూ.1.63కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. రెండో విడతలో అన్ని పంచాయతీలను అనుసంధానం చేసిరోడ్లు నిర్మాణం చేపడతాం.

ప్రశ్న : నిధులు ఏ శాఖ నుంచి మంజూరయ్యాయి?

జవాబు: వందశాతం ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ నిర్మిస్తున్నాం.

ప్రశ్న : మురుగుకాల్వల పరిస్థితి?

జవాబు: ప్రస్తుతానికి నిర్మాణం చేపట్టలేదు. ప్రభుత్వ ఆదేశానుసారం కాల్వల నిర్మాణం చేపడుతాం.

ప్రశ్న : మట్టిరోడ్ల నిర్మాణం కూడా చేపడుతున్నారా?

జవాబు: ప్రధానంగా సీసీరోడ్లు నిర్మాణం చేపడుతున్నాం. మట్టి రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

సీఐపై చర్యలు తీసుకోవాలి

డీఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించిన టీడీపీ శ్రేణులు



డీఎస్పీ కార్యాలయంలో ఎదుట బైఠాయించిన టీడీపీ నాయకులు



డీఎస్పీ రవికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి కొమ్ము కాస్తున్న ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడుపై తక్షణం శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ చాగలమర్రి మండల కన్వీనర్, న్యాయవాది కరిమద్దెల నరసింహారెడ్డి, పలువురు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో పాల సొసైటీ ఎన్నికల నామినేషన్‌లో సీఐ కంబగిరి రాముడు టీడీపీ నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ ఆళ్లగడ్డ పట్టణంలోని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి డీఎస్పీ కార్యాలయం వద్ద రహదారిపై బైఠాయించారు. ప్రతిపక్ష పార్టీకి వత్తాసు పలుకుతూ తమపై దాడికి పాల్పడిన సీఐ కంబగిరి రాముడు డౌన్ డౌన్ అంటూ క్షమాపణలు చెప్పాలంటూ టీడీపీ నాయకులు నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటల పాటు ధర్నా కొనసాగించారు. వైసీపీ అభ్యర్థులను బందోబస్తుతో స్వయంగా సీఐ నామినేషన్ వద్దకు తీసుకెళ్లడంతో టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, పలువురు నాయకులు ప్రశ్నించడంతో సీఐ దురుసుగా ప్రవర్తించి చొక్కా పట్టుకొని తోశారని ఆరోపించారు. అనంతరం డీఎస్పీ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ, శిరివెళ్ల మండలాల టీడీపీ కన్వీనర్లు శీలం హరికుమార్‌రెడ్డి, కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, యామా గుర్రప్ప, జాఫర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఉసేన్‌బాష, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో ఇతర కులాలను చేర్చరాదు



డిటీ మారుతికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బేతంచెర్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ జాబితాలో ఇతర కులాలను చేర్చరాదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విడత ల శేషన్న, సభ్యులు సుమంత్, శ్రీపతి నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి అందుబాటులో మంత్రి బీసీ

బనగానపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం నుంచి మూడు రోజుల పాటు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని మంత్రి పీఏ మురళీమోహన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి తెలియజేసి పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు.

1,360 హెక్టార్లలో పంట నమోదు

చాగలమర్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేస్తున్నట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. 4,330 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారని, అందులో 1,360 హెక్టార్లకు రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఈఈ హరిగోపాల్

సంజామల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఈఈ హరిగోపాల్ సూచించారు. శుక్రవారం ఆకుమళ్ల లేఅవుట్‌లో ఆయన ఏఈ బాల చంద్రుడుతో కలిసి నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. మార్చి ఆఖరునాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయితే వెంటనే బిల్లులు అందజేస్తామన్నారు. నిర్మాణాలు పూర్తి కాకపోతే లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. మండల వ్యాప్తంగా కొత్త గృహాలను ప్రభుత్వం త్వరలో మంజూరు చేస్తుందన్నారు.

పాఠశాలల అభివృద్ధి అందరి బాధ్యత

- చాగలమర్రి ఎంఈవో అనూరాధ

చాగలమర్రి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధి అందరి బాధ్యత అని ఎంఈవో అనూరాధ అన్నారు. చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాల నిర్వహణ కమిటీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు. ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యాలు, కమిటీల బాధ్యతలు, మెరుగైన వసతుల కల్పన వంటి అంశాలపై చర్చించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్పీలు శేషాద్రి, మద్దిలేటి, రాజు, ప్రసాద్, సీఆర్పీలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలోని ఎంఈవో కార్యాలయంలో ఎంఈవోలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్యల ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, యాజమాన్య కమిటీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, డీఆర్పీలు విజయకుమార్‌రెడ్డి, ప్రసాద్, గిరీష్ కుమారు పాల్గొన్నారు.

దొర్నిపాడు: దొర్నిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, అన్ని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ కిషోర్, దొర్నిపాడు కమిటీ చైర్మన్ సుధాకర్, గురువయ్య, నరసింహా తదితరులు ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా 104 వైద్య సేవలు

కొలిమిగుండ్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు 104 వైద్య సేవలను ప్రతిష్టాత్మకంగా అందిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యులు డాక్టర్ హరిచరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గొర్విమానుపల్లె గ్రామంలో వైద్య సిబ్బంది 104 వైద్య సేవలను అందించారు. విలువైన మందులతో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న 104 వైద్య సేవలను ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

తాగునీటి సమస్యల నివారణ కోసం చర్యలు

కొలిమిగుండ్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగు నీటి సమస్యల నివారణ కోసం ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ సాయిక్రిష్ణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో చేతి పంపులకు మరమ్మతులు చేయించారు. సర్పంచ్ శివ ఆధ్వర్యంలో నీటి వనరులు పుష్కలంగా ఉన్న అన్ని బోర్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా కాలనీల్లో నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని సర్పంచ్ శివ అన్నారు.

ఎస్సార్బీసీలో పడి వృద్ధుడి గల్లంతు

బనగానపల్లె, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని యాగంటిపల్లె రహదారిలోని ఎస్సార్బీసీ కాల్వలో పడి ఓబయ్య(70) అనే వృద్ధుడు శుక్రవారం తెల్లవారుజామున గల్లంతయ్యాడు. ఎస్సార్బీసీ కాల్వ సమీపంలో కొట్టంలో నివసిస్తున్న ఓబయ్య ఇటీవలే గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు కాల్వవద్దకు వెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడ ఓబయ్య వదిలిన చెప్పులు, చేతి కర్ర ఉండడం తో ఎస్సార్బీసీ కాల్వలో గల్లంతైనట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. ఉదయం నుంచి ఓబయ్య కోసం పోలీసులు, కుటుంబ సభ్యులు కాలువలో గాలిస్తున్నారు. రాత్రి వరకు ఓబయ్య ఆచూకీ లభించలేదని పోలీసులు వెల్లడించారు.

మహిళల విద్య కోసం అహర్నిశలు కృషి

- రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎన్‌టీకే నాయక్
- ఘనంగా సాయిత్రీబాయి జయంతి

డోన్ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే మహిళల విముక్తి, విద్య కోసం అహర్నిశలు కృషి చేశారని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. పట్టణంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో జరిగిన సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలకు రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎన్‌టీకే నాయక్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైష్ణవి డిగ్రీ కళాశాల నిర్వాహకులు ప్రకాష్ రెడ్డి, చంద్రకళాధర్ రెడ్డి, మండల ఎంఈవో-2 రామనర్సప్ప, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, నెహ్రూనగర్ పాఠశాల ఉపాధ్యాయులు సురేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సార్క్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో కరస్పాండెంట్ జె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహ విష్కరణ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మిట్టా శ్రీనివాసులు, స్థానిక బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఏఈ నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి హెచ్ఎం రామకృష్ణ, ఏపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.



బనగానపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

రుద్రవరం: రుద్రవరం ఆదర్శపాఠశాలలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే రుద్రవరం ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయురాలు వసుంధరను సన్మానించారు.

ఆళ్లగడ్డ (శిరివెళ్ల): ఆళ్లగడ్డలోని వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్‌బాష, ఉపాధ్యాయినిలు సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఇష్రత్‌బేగం, ఉపాధ్యాయులు సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు.

దొర్నిపాడు: దొర్నిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఎంఈవోలు మనోహర్‌రెడ్డి, రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు సావిత్రీబాయిపూల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయినిలు జయలక్ష్మి, సరస్వతి, ఉమాదేవి, శివశంకరమ్మ, శాంతిలక్ష్మిను సన్మానించారు.

అవుకు: అవుకు పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీధర్‌రావు, ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ హేమీమా, కేజీ బీవీ ప్రిన్సిపాల్ భవాని, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ భారతిని ఘనంగా సన్మానించారు.

బేతంచెర్ల: మండలంలోని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బేతంచెర్ల మోడల్ స్కూల్‌లో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గట్టు సోమశేఖర్, ప్రిన్సిపాల్ మరియదాసు, ఎస్ఎంసీ చైర్మన్ బాలకృష్ణ, ఎండీఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బనగానపల్లె: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. సావిత్రీ బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాధికారిత చైర్‌పర్సన్ లలిత, కోఆర్డినేటర్ వసుంధర, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహమ్మద్‌గౌస్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే బనగానపల్లె బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి జయంతిని నిర్వహించారు.

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, అధ్యాపకులు నవీన్ పాటి, రామక్రిష్ణయ్య, సత్యబాబు పాల్గొన్నారు.



డోన్ వైష్ణవి డిగ్రీ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్ ఎన్‌టీకే నాయక్